# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 19-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:275 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

**-మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ**

హైదరాబాద్ జూలై 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.

ఈ మేరకు మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పశ్చిమ మధ్య ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉన్న అల్పపీడనం సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది.

అలాగే, వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని.. రాబోయే రెండుమూడు రోజుల్లో బలపడి వాయువ దిశగా ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందని పేర్కొంది. ఇక తెలంగాణలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## చురక

నైతిక అనైతికాలు
నవ్వొస్తది అంటుంటే
రాజకీయ అంగడిలో
రోజు ఇది వింటుంటే

తాము చేస్తే స్వచ్ఛమని
తైతక్కల స్వంత కొలుపు
అవే పరులు చేస్తే తప్పు
ఆందోళన కొరకు పిలుపు

-వేల్పుల నారాయణ
9440433475

# ఇచ్చిన మాట ప్రకారమే రైతు రుణమాఫీను విడుదల

**-లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ**
**-పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 7వేల కోట్లు జమ**
**-ఈ నెలాఖరుకు లక్షన్నర రూపాయలు,**
**-ఆగస్టు 15 నాటికి 2 లక్షల వరకు రుణాబకాయిల చెల్లింపు**
**-రైతు రుణమాఫీకి రూ. 31 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది**
**-రుణమాఫీ నిధులను వేరే అప్పులకు జమ చేయవద్దని ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు**
**- కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డు**
**-రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు రైతువేదికల వద్ద సంబురాలు**
**-తెలంగాణ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ జూలై 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్): తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే రైతు రుణమాఫీని విడుదల చేశారు. గురువారం తెలంగాణ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించారు.సుమారు పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు. నిధులు విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు రైతువేదికల వద్ద సంబురాలు చేసుకుంటున్నారు. ఈ నెలాఖరుకు లక్షన్నర రూపాయలు, ఆగస్టు 15 నాటికి 2 లక్షల వరకు రుణాబకాయిలను రైతుల తరఫున ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేలా ప్రణాళిక చేసింది.రైతు రుణమాఫీకి రూ. 31 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రుణమాఫీ నిధులను వేరే అప్పులకు జమ చేయవద్దని ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుందని చెప్పారు. కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.కాగా.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫేస్ -1 కింద 18న రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేస్తుండటంతో ఘనంగా సంబరాలు చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో రుణమాఫీ నగదు జమ చేయడంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో కలిసి సంబరాలు చేసుకుం టున్నారు.రైతు కుటుంబాన్ని గుర్తించడానికి ఆహార భద్రతాకార్డు వివరాలు ప్రామాణికంగా రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకారం కేంద్ర బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తించనుంది. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక నోడల్ అధికారిని నియమించగా, ఆ అధికారి నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్‌కు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. డిసెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులు. అలాగే రెండు లక్షల మించిన రుణం ఉన్న రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన ఉండగా, ఆ తరువాతనే రుణమాఫీ పొందే వెసులుబాటు కల్పించింది.

# దేశ చరిత్రలోనే ఇది తొలిసారి.. బ్యాంకర్ల సమావేశంలో తుమ్మల

**-ఆ ఘనత రేవంత్, భట్టిలదే**
**-ఏ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేయలేదు**
**-అలా చేసిన గౌరవం కాంగ్రెస్ ప్రభుత్వానిదే**



హైదరాబాద్, జులై 18 :దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారి ఒక ప్రభుత్వం రూ.2 లక్షల రుణ మొత్తాన్నీ మాఫీ చేయడం అందరూ ఈ రోజు చూస్తున్నారని బ్యాంకర్లను ఉద్దేశించి అన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. హైదరాబాద్ ప్రజాభవన్‌లోనేడు జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనకు తెలిసి మీ బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది కనీవినీ ఎరుగని సందర్భం అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిలు ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక దీక్షతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారంటూ ప్రశంసలు కురిపించారు.. తాము ఈ పథకం ప్రకటించి ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పినప్పుడు చాలా మంది బ్యాంకర్లుకు కూడా నమ్మకం కుదరలేదన్నారు. దానికి కారణం కూడా లేక పోలేదు. గతంలో ఉన్న ప్రభుత్వం రెండు విడతలలో చేసిన మాఫీ ని మీరు ప్రత్యక్షంగా చూడటంతోనే నమ్మలేదన్నారు. అనేక మంది బ్యాంకర్స్ కూడా పలు సందర్భాల్లో గత రెండు పర్యాయాలు అమలు చేసిన తీరుతో రుణమాఫీ వల్ల రైతులకు ప్రయోజనం చేకూరలేదన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న రూ.2లక్షల రుణ మాఫీ వంటి బృహత్తర కార్యక్రమంలో రైతులతో పాటు బ్యాంకర్లు కూడా భాగస్వామ్యులే అన్నారు. తమ ప్రభుత్వం ఈ రుణ మాఫీ పథకాన్ని ఆగస్ట్ కల్లా పూర్తి చేయడానికి కట్టుబడి ఉందన్నారు.

అన్న మాట ప్రకారం మొదటి విడతలో కుటుంబానికి లక్ష వరకు ఉన్న పంట రుణాలన్నీ ఏకకాలంలో మాఫీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు అందరికీ తమ ప్రభుత్వం తరఫున ఒకటే విజ్ఞప్తి అన్నారు. రైతు రుణాన్ని రెన్యువల్ చేసుకున్నట్లయితే వారికి నగదు రూపంలో ఖాతాలకు జమచేయబడిన మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. ఒకవేళ రైతు పంట రుణాన్ని బాకీ పడ్డట్లైతే వారికి ప్రభుత్వాలు విడుదల చేసిన మొత్తాన్ని రుణం క్రింద జమ చేసుకొని, కొత్త రుణాన్ని వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నుండి పంటరుణమాఫీకి చెల్లించే మొత్తం రైతులకు తప్పకుండా చేరే బాధ్యత ప్రతి ఒక్క బ్యాంకు తీసుకోవాలన్నారు. ఆ విధంగా తమ తమ శాఖలన్నింటికి ఆదేశాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు.

# బోనాలకు పకడ్బంది ఏర్పాట్లు .. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**-భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**
**-వీఐపీల ప్రొటోకాల్‌పై జాగ్రత్తగా ఉండాలి**
**-బోనాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**
**-సికింద్రబాద్ అమ్మవారి టెంపుల్ పరిశీలన**

హైదరాబాద్, జులై 18 :బోనాలు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. గురువారం సికింద్రబాద్ ఉజ్జయినీ అమ్మవారి టెంపుల్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బోనాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా బోనాల ఉత్సవాలు హైదరాబాద్ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలాగే.. వీఐపీలు వచ్చేటప్పుడు ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ అధికారులు రీజినల్, జాయింట్ కమిషనర్, సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్, హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు

**-25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం**

హైదరాబాద్ జూలై 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం.పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.

# దోమల ఉత్పత్తి అయ్యే హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ఆమ్రపాలి

హైదరాబాద్, జులై 18 :గ్రేటర్‌లో దోమలు ఉత్పత్తి అయ్యే హాట్ స్పాట్‌లను గుర్తించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటఅధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ యుసిడి, హెల్త్, చీఫ్ ఎంటమాలజీ, కాల్ సెంటర్ ఓఎస్డీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి నివారణలో భాగంగా పాఠశాల, కాలేజీలలో చేపట్టే అవగాహన కార్యక్రమాలు వెంటనే పూర్తి చేసి, హాట్ స్పాట్‌లపై దృష్టి సారించాలని కమిషనర్ చెప్పారు.

స్వచ్ఛ ఆటో హాజరు పరిస్థితి సరిగా లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని, ఈఎంఐ పూర్తి చేసిన స్వచ్ఛ ఆటో యాజమాని సక్రమంగా హాజరు కాకుండా నిర్ధేశించిన ప్రకారంగా చెత్త సేకరణ చేయని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈఎంఐ పూర్తి కానీ స్వచ్ఛ ఆటో చెత్త సేకరణలో గానీ, సక్రమంగా హాజరు కానీ పక్షంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగి కేటాయింపు చేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన జీవీపీల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. షాపింగ్ మాల్, సినిమా థియేటర్లలో టాయిలెట్‌లు పరిశుభ్రంగా ఉండే విధంగా, ఫైర్ సేఫ్టీ కూడా పరిశీలన చేసి సర్కిల్ వారీగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# రుణ మాఫీ చేశాం- ఉప ముఖ్యమంత్రి భట్టి

**-ఇక సులభతరంగా రైతులకు రుణాలు ఇవ్వండి**
**-బ్యాంకర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి సూచన**
**-ఏకకాలంలో 31వేల కోట్లు రుణమాఫీ చేయడం కొత్త చరిత్ర**
**-బ్యాంకర్లు కూడా రైతు సంబరాలు నిర్వహించాలి**




హైదరాబాద్, జులై 18 :ప్రభుత్వం జమ చేస్తున్న సొమ్మును కేవలం రైతులు పంట రుణమాఫీ కోసమే ఉపయోగించాలని రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. పంట రుణాల మాఫీ నేపథ్యంలో గురువారం ప్రజా భవన్ లో ఇవాళ జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ స్కీమ్ అమలుపై బ్యాంకర్లకు పలు కీలక సూచనలు చేశారు.

రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని.. భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరారు. లోన్లు ఇచ్చే విషయంలో ఎక్కడా అశ్రద్ధ చూపొద్దని సూచించారు. ఈ విషయంలో లీడ్ బ్యాంకు పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. ఆగస్టు నెల దాటకముందే 31వేల కోట్లు రైతు రుణమాఫీ కింద విడుదల చేస్తామని, ఇవాళ సాయంత్రం నాలుగు గంటలకు 11 లక్షల పైబడి రైతులకు రూ.ఆరువేల కోట్ల పైబడి నిధులు విడుదల చేస్తున్నామని వివరించారు.

### ఇదో కొత్త చరిత్ర ..

భారతదేశ బ్యాంకింగ్ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తం ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర అని అన్నారు భట్టి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహం అన్నారు. రుణమాఫీ పథకం అమలులో బ్యాంకర్ల సహకారం అవసరమన్నారు. రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతులు ఇంబ్బంది పడకుండా బ్యాంకర్లు చూడాలని, చిన్నపొరపాటు కూడా జరగకుండా చూసుకోవాలని సూచించారు.

### ఇది పండగ రోజు ..

పండగలా రుణమాఫీ జరగాలని భట్టి పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర జీఎస్ జీడీపీలో 16.5% వ్యవసాయ రంగం నుంచి వస్తుందంటూ .. రాష్ట్రంలో 45% పైబడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్నారు. రైతు రుణమాఫీ నేపథ్యంలో బ్యాంకుల వద్ద అధికారులు ఉత్సవాలు జరపాలని కోరారు.


ప్రభుత్వం చేస్తున్న కృషిని రైతులకు వివరించాలన్నారు. రైతుల కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు, పథకాలు తీసుకురావాలని తమ ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. సాంప్రదాయ పంటలతో పాటు కమర్షియల్ క్రాప్స్ ను ప్రోత్సహించబోతున్నామన్నారు. బ్యాంకుల్లో రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# వీధి కుక్కల దాడులపై హైకోర్టు సీరియస్..

హైదరాబాద్, జులై 18 :తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు పెరిగిపోతున్న వీధి కుక్కల దాడులను సీరియస్‌గా తీసుకున్న ఉన్నత న్యాయస్థానం.. ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కుక్కల దాడిని ప్రభుత్వం పట్టించుకోకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు హైకోర్టుకు సమర్పించిన నివేదికలో ప్రభుత్వం పేర్కొంది.

ఈ అంశంపై ధర్మాసనం ఒకింత అసహనాన్ని వ్యక్తం చేసింది. ప్రభుత్వం దృష్టి కేవలం ధనవంతులు నివసించే ప్రాంతాలపైనే కాకుండా.. సామాన్యులు నివసించే మురికివాడలపైన కూడా పెట్టాలని ధర్మాసనం కీలక ఆదేశాలు చేసింది. వీధి కుక్కల బారి నుంచి పిల్లలను రక్షించేందుకు వెంటనే పరిష్కార మార్గాలు అన్వేషించాలని ప్రభుత్వానికి సూచించింది.

తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నామని.. అప్పటిలోగా కుక్కల దాడుల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కార్యాచరణ ప్రణాళికలను తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. వచ్చే వాయిదాకు పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



## నేటి కందం- నేటికీ అందం

నాకమునకు సేవల నెగ
బాకించగ తలచి నాటి బాంకుల జాతీ
యీకరణ మహోత్సవమును
కాకోదర శయనుని కృప గావింపవలెన్

(19-7-69 బాంకుల జాతీయీకరణ )

-రాధశ్రీ
సెల్:9494481210




# రోగుల పాలిట శాపంగా మారుతున్న ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం.. !

భారతదేశ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థలకు చెందిన వైద్యుల్లో 50 శాతం మంది కనీస మార్గదర్శకాలను తుంగలో తొక్కి అనవసరమైన, ప్రమాదకర ఔషధాలను రోగులకు సిఫార్సు చేస్తూ ప్రజారోగ్యాన్ని పరిహాసం చేస్తున్నారని ఇటీవల 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్'లో ప్రచురితమైన పరిశోధనా వ్యాసం తెలియజేస్తున్నది. ఏఐఐఎంఎస్, సఫ్దర్‌గంజ్ లాంటి అత్యుత్తమ ఆసుపత్రులతో సహ అనేక ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య చికిత్సలకు సంబంధించిన మార్గనిర్దేశకాలు పాటించకుండా అవసరంలేని, ఖరీదైన, దుష్ప్రభావం కలుగజేసే ఆంటీబయోటిక్ మందులను విచక్షణారహితంగా, అనాలోచితంగా సిఫార్సు చేయడంతో రోగులకు వైద్య ఖర్చులు పెరగడం, ప్రయోజనం కలిగించని మందులు వాడడం, ఆంటీబయోటిక్ ఔషధాల పట్ల వ్యాధి నిరోధకత పెరగడం, ఔషధాల దుష్ప్రభావాలు పెరగడంతో సామాన్య రోగులు కష్టాల పాలు అవుతున్నట్లు అధ్యయన బృందం తెలియజేస్తున్నది.

మార్గదర్శకాలకు పట్టించుకోని స్పెషలిస్ట్ వైద్యులు:

మన ప్రభుత్వ వైద్యుల పని తీరుతో రోగులకు తీవ్ర అనారోగ్యాలు పెరగవచ్చని కూడా తెలుస్తున్నది. చిన్న చిన్న గాయాలకు సహితం అధిక డోసులు, రెండు లేదా అంత కన్న ఎక్కువ రకాలైన ఖరీదైన ఆంటీబయోటిక్స్ సిఫార్సు చేయడంతో ఆర్థిక భారంతో పాటు ఆంటీబయోటిక్ రిసిస్టెన్స్ సమస్యలతో పాటు ఔషధ దుష్ప్రభావం కూడా ఉత్పన్న అవుతున్నట్లు వివరిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు సహితం అధిక డోసులు, అసంపూర్ణ ప్రిస్క్రిప్షన్స్, కాలపరిమితులు, ఫ్రీక్వెన్సీల హద్దులు దాటి రోగుల ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నారనే ఆశ్చర్యకరమైన అంశాలను ప్రచురించింది. పరిశోధనా బృందం అధ్యయనం చేసిన 13 ప్రధాన ప్రభుత్వ వైద్య సంస్థలకు చెందిన 4,838 ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యుల అవుట్ పేషంట్ల మందుల సిఫార్సులను లేదా ప్రిస్క్రిప్షన్స్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లుగా పేర్కొనబడింది. వీటిలో 2,171 సిఫార్సులు లోపభూయిష్టంగా ఉన్నాయని, 475 సిఫార్సులు పూర్తిగా తప్పుగా ఉన్నట్లు, 102 సిఫార్సులు అసంబద్ధ మందులు రాసినట్లు తేల్చారు. దాదాపు 18 ఏండ్ల అనుభవం కలిగిన స్పెషలిస్టు డాక్టర్లు సహితం ఇలా విచక్షణారహితంగా ఔషధాలను సిఫార్సు చేయడం విచారకరమే కాదు, అక్షేపణీయం కూడా. ప్రభుత్వ వైద్యుల్లో 45 శాతం మంది అసంపూర్తిగా మందులు సూచించడం, 10 శాతం వరకు ఆమోదయోగ్యం కాని విచలనాలు (అన్‌అక్సెప్టెడ్ డీవియోషన్స్) చూపడం, పరిమితులకు మించి ఖరీదైన ఆంటీబయోటిక్స్ సిఫార్సు చేయడం, నిర్ధేశిత మార్గదర్శకాల పరిధులు దాటి ఔషధాలు సిఫార్సు చేయడంతో రోగుల ఆరోగ్యాలు ప్రమాదకర పరిస్థితులకు చేరుతున్నట్లు వెల్లడిస్తున్నారు. ఒక చిన్న ఉదాహరణగా పెప్టిక్ అల్సర్ సమస్యకు అనవసరంగా 'పెంటోప్రజోల్' అనబడే మందులను సిఫార్సు చేయడం వల్ల కడుపు ఉబ్బడం, నీరు పట్టడం, దద్దుర్లు రావడం లాంటి దుష్ప్రభావాలకు రోగులు గురి కావడం దురదృష్టకరం.

వైద్యోనారాయనోహరిః అన్న నానుడికి సమాజం కట్టుబడి ఉంది. వైద్యులను పూర్తి నమ్మడం రోగులకు తప్పదు. ఎండి, ఎంఎస్ నిపుణులు సహితం రోగుల నిస్సహాయ స్థితిని ఆసరాగా చేసుకొని అసంబద్ధ, ఖరీదైన, ప్రమాదకర మందులను నిర్లక్ష్యంగా సిఫార్సు చేయడాన్ని తీవ్రంగా తీసుకోవాలి. నిర్లక్ష్య సిఫార్సు చేసిన విషయాలు రుజువు అయిన సందర్భాల్లో అలాంటి వైద్యులపై కఠిన చర్యలు కూడా తీసుకోవాలని పౌరసమాజం కోరుతున్నది. పేదలు, రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వ వైద్యుల భరతం పట్టి ప్రజారోగ్యానికి పట్టం కట్టాలి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# రాష్ట్రంలో రాక్షస పాలన.. కూటమి పాలనపై జగన్ మండిపాటు

## -వినుకొండలో వైసీపీ కార్యకర్త హత్య
## -వరుసగా వైసీపీ నేతలపైనా, ఆస్తులుపైనా దాడులు
## -నెలన్నర పాలనలోనే శాంతిభద్రతలు చిన్నాభిన్నం
## -రెడ్ బుక్ దాడులపై రాష్ట్రపతికి ఫిర్యాదు

అమరావతి, జులై 18 :ఆంధ్రప్రదేశ్ లో రాక్షస పాలన కొనసాగుతోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ చీఫ్ జగన్ మండిపడ్డారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త రషీద్ హత్యపై జగన్ స్పందించారు. రషీద్ కుటుంబానికి



సానుభూతి తెలిపారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నెలన్నర రోజులు మాత్రమే అయిందని గుర్తుచేశారు. ఈలోపే రాష్ట్రాన్ని హత్యలు, అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్ గా మార్చేశారంటూ టీడీపీ సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అన్నది ఎక్కడా కనిపించడంలేదని, ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కరవైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని అణగదొక్కడమే లక్ష్యంగా ఈ దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**ఈ హత్య ప్రభుత్వానికి సిగ్గు చేటు..**

రాజకీయ కక్షతో దాడులకు తెగబడుతున్నారని జగన్ విమర్శించారు. వినుకొండలో బుధవారం రాత్రి జరిగిన హత్య రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ఠ అని చెప్పారు. ఈ దారుణం ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సహా బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు రాజకీయ దురుద్దేశాలతో ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తున్నారని జగన్ ఆరోపించారు. ఎవరి స్థాయిలో వాళ్లు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, పోలీసు సహా యంత్రాంగాలన్నింటినీ నిర్వీర్యం చేశారని అన్నారు. దీంతో నేరగాళ్లు, హంతకులు చెలరేగిపోతున్నారని విమర్శించారు.

అధికారం శాశ్వతం కాదని గుర్తెరిగి హింసాత్మక విధానాలు వీడాలని చంద్రబాబును జగన్ గట్టిగా హెచ్చరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో ప్రత్యేక విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఏపీలో దిగజారిన శాంతిభద్రతల పరిస్థితులపై దృష్టిపెట్టాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా లకు విజ్ఞప్తి చేసినట్లు ట్వీట్ లో తెలిపారు. బాధితులకు పార్టీ తరపున అండగా నిలబడతామని, అన్ని రకాలుగా ఆదుకుంటామని పార్టీ కార్యకర్తలకు జగన్ హామీ ఇచ్చారు.

**రాష్ట్రపతికి ఫిర్యాదు..**

కాగా, వినకొండలో వైసీపీ నాయకుడిని పట్టపగలే నడిరోడ్డుపై హత్య చేయడం అంశాన్ని వైసీపీ రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు వివరాలతో రాష్ట్రపతిని ట్యాగ్ చేస్తూ ఎక్స్ ద్వారా ట్వీట్ చేసింది.. టీడీపీ ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాలని ఈ ట్వీట్ లో కోరింది..

**మీ వాళ్లే హత్య చేస్తే.. మా మీద నిందవేస్తారు..**

ఆంధ్రప్రదేశ్ లో ఏం జరిగినా ముందు టీడీపీ మీద తోసేయడమే పనిగా పెట్టుకుందని వైసీపీ పార్టీపై అధికార పార్టీ మండిపడింది. వినుకొండలో బుధవారం జరిగిన వైసీపీ కార్యకర్త రషీద్ హత్యపై ట్విట్టర్ లో స్పందించింది. 'పొద్దున్నే 3 గంటలకు ఫోన్ చేసి బాబాయ్‌ని లేపించి, చంద్రబాబు చంపాడని పేపర్ లో వేసిన నీచ చరిత్ర వీళ్ళది.. ఏది జరిగినా, ముందు టీడీపీ మీద తోసేయటమే' అంటూ టీడీపీ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది.

బుధవారం జరిగిన దారుణ హత్యలో చనిపోయిన రషీద్, చంపిన షేక్ జిలానీ ఇద్దరూ వైసీపీ కార్యకర్తలేనని ట్వీట్ లో పేర్కొంది. ఇద్దరూ వైసీపీ నేత, స్థానిక రౌడీగా పేరొందిన పీఎస్ ఖాన్ కు ప్రధాన అనుచరులేనని వెల్లడించింది. సదరు పీఎస్ ఖాన్ వైసీపీ చీఫ్ జగన్ కు ప్రధాన అనుచరుడని వివరించింది. అయితే, తప్పు ఎవరు చేసినా తప్పేనని, తప్పు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేసింది. గడిచిన ఐదేళ్లలో విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ రెచ్చిపోయిన వైసీపీ సైకోలకు పట్టిన మదం దించి, వారు చేసే దారుణాలను ఆపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసింది.

# జూలై 21న అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జులై 18 :పార్లమెంటు బడ్జెటు సమావేశాల కంటే ముందుగా పార్లమెంటు ఉభయ సభలలోని రాజకీయ పక్షాల నేతలతో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కిరెన్ రిజిజు ఒక సమావేశం కానున్నారు. ఈ అఖిల పక్ష సమావేశాన్ని న్యూ ఢిల్లీ లోని పార్లమెంట్ భవనాన్ని ఆనుకొని ఉన్న మెయిన్ కమిటీ రూములో 2024 జూలై 21న ఉదయం పూట 11 గంటలకు నిర్వహించనున్నారు.

పార్లమెంటు బడ్జెటు సమావేశాలు 2024 జూలై 22న ప్రారంభం కానున్నాయి; ప్రభుత్వ కార్యకలాపాలలో ఏవైనా అనివార్య అవసరాలు ఎదురైతే గనక వాటిని లెక్కలోకి తీసుకొంటారు; ఈ సమావేశాలు 2024 ఆగస్టు 12న ముగిసే అవకాశం ఉంది.

# వీరభద్రంను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేతలు




ఖమ్మం, జులై 18 :(నేటినిజం ప్రతినిధి): గురువారం కామేపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ గా పుచ్చకాయల వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కమతం రామకృష్ణలు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ పూలబొకేను అందించి సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, సొసైటీ డైరెక్టర్లు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కమతం రామకృష్ణ, నల్లమోతు రవికుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# 'ఎలక్ట్రానిక్స్.. ప్రపంచ విలువ శ్రేణిలో భారత్ భాగస్వామ్య చోదకం' పేరిట నీతి ఆయోగ్ నివేదిక ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జులై 18 :నీతి ఆయోగ్ 2024 జులై 18న "ఎలక్ట్రానిక్స్: ప్రపంచ విలువ శ్రేణిలో భారత్ భాగస్వామ్య చోదకం" పేరిట ఒక నివేదికను ఆవిష్కరిస్తుంది. భారత ఎలక్ట్రానిక్స్ రంగం పరిధులు-సవాళ్లు సహా దానిపై లోతైన విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచ తయారీ కూడలిగా మారేందుకు ఈ నివేదిక మార్గనిర్దేశం చేస్తుంది.

ప్రస్తుత పరిస్థితుల నడుమ అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రపంచ విలువ శ్రేణి (జివిసి)లోని వస్తు సముదాయం వాటా 70 శాతంగా ఉంది. 'జివిసి'లో భారత్ తన భాగస్వామ్యం పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ఈ వాస్తవం నొక్కి చెబుతోంది. ఈ మేరకు 'జివిసి'లో కీలక పాత్ర పోషించే ఎలక్ట్రానిక్స్, సెమి-కండక్టర్, ఆటోమొబైల్, రసాయన, ఔషధ తదితర రంగాలకు ప్రాధాన్యం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చు. ప్రపంచ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులలో దాదాపు 80 శాతం 'జివిసి' పరిధిలోని ఉత్పత్తులే కావడం వల్ల 'జివిసి'లో ఈ రంగానికి గణనీయ ప్రాధాన్యం ఉంది.

భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల విలువ 2023 ఆర్థిక సంవత్సరంలో గణనీయ స్థాయిలో నమోదైంది. ఆ మేరకు మొత్తం వస్తూత్పత్తుల ఎగుమతులలో ఈ రంగం వాటా 5.32 శాతంగా ఉంది. ప్రపంచ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్స్ రంగం పోటీతత్వాన్ని ఈ రంగం ఎగుమతుల జోరు రుజువు చేస్తోంది. అలాగే మన ఉత్పత్తులకుగల అంతర్జాతీయ డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోగల సామర్థ్యం కూడా ఈ రంగానికి ఉందని స్పష్టమవుతోంది. ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్థానం ఈ రంగం నుంచి ఎగుమతులతో మరింత మెరుగుపడింది. ఇక 'జివిసి'లో భాగస్వామ్యం పరంగా ఎలక్ట్రానిక్స్ రంగం అగ్రస్థానంలో ఉంది. ఇది ఏదైనా ఒక దేశానికో లేదా ఆర్థిక వ్యవస్థకో పరిమితం కాకుండా భౌగోళికంగా అనేక దేశాలు, సంస్థల స్థాయికి విస్తరించి ఉంది.

ప్రస్తుతం భారత్ ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తుల విడిభాగాల తుది కూర్పులో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ బ్రాండ్లు-డిజైన్ సంస్థలు భారతదేశంలోని ఎలక్ట్రానిక్ తయారీ సేవల (ఇఎంఎస్) కంపెనీలకు తుది కూర్పు, పరీక్షలు-ప్యాకేజింగ్ పనులను అధికశాతం అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిజైన్-విడిభాగాల తయారీ సంబంధిత పర్యావరణ వ్యవస్థ ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది.

మన దేశం వికసిత భారత్ దిశగా పయనించడంలో తయారీ రంగానిదే కీలక పాత్ర. కాబట్టి, ప్రపంచ విలువ శ్రేణిలో భాగస్వామ్యంతో 'మేక్ ఇన్ ఇండియా'కు ఊపునివ్వడం ద్వారా ఈ సంకల్పాన్ని సాకారం చేసుకోవచ్చు. ఈ దృక్కోణంతో ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ ఉత్పాదక శక్తిగా రూపొందడం లక్ష్యంగా మార్గనిర్దేశం చేయడంపై సమగ్ర నివేదికను నీతి ఆయోగ్ ఆవిష్కరించనుంది.

# శ్రీకాకుళం జిల్లా ప్రగతికి బాటలు వేస్తాం.. అచ్చెన్నాయుడు

## -ఏడాదిలో కే.ఆర్ స్టేడియం పనులు పూర్తి..
## -మూలపేటలో మినీ ఎయిర్పోర్ట్
## -వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జులై 18 : పక్కా ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. జిల్లాలోని గ్రామాలన్నింటినీ ఐదేళ్ల వ్యవధిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి స్వయం సమృద్ధిని సాధించే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పునః నిర్మాణ పనులను ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి గురువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తో కలసి కొద్దిసేపు ఆర్ అండ్ బీ, క్రీడా శాఖ, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.



అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ? జిల్లా కేంద్రంలో ఏళ్ల తరబడి రెండు ప్రధాన (స్టేడియం, శ్రీకాకుళం ? ఆమదాలవలస రహదారి) సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయోనని గత ప్రభుత్వం మీద నమ్మకం లేక జిల్లా ప్రజానీకం దేవుడి మీద భారం వేసిందని, ఇప్పుడు వారి ఆశలు నెరవేరే రోజు వచ్చిందన్నారు. స్టేడియం పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌కి రెండేళ్ల సమయం ఉన్నపటికీ తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని కోరామని, ఏడాదిలోపే పూర్తి చేసి ఇస్తామని అధికారుల సమక్షంలో హామీ లభించిందని, అలాగే శ్రీకాకుళం ఆమదాలవలస రహదారికి అత్యవసరంగా రూ.కోటి నిధులు ఇచ్చామని, కొత్త రోడ్డు జంక్షన్ నుంచి వాకలవలస వరకూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. రహదారులే ప్రగతికి బాటలని, ప్రతీ వారం ఈ రెండు పనులపై సమీక్ష చేస్తామని చెప్పారు.

ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా పని చేస్తున్నామని, గత ఐదేళ్లలో వంశధార నుంచి చుక్క నీరు పలాస, వజ్రపుకొత్తూరులకు ఇవ్వలేక పోయారని, సీఎం చంద్రబాబు సారథ్యంలో తాము వచ్చీ రాగానే రూ.90 లక్షలతో .70 లక్షల ఎకరాలకు నీరివ్వడం ఎంతో తృప్తినిచ్చిందని చెప్పారు. తొమ్మిది శాఖలు నిర్వహిస్తున్న మంత్రిగా జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని మూలపేట పోర్టు పూర్తి చేసి, అక్కడే మినీ ఎయిర్పోర్ట్ నిర్మిస్తామన్నారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, కొత్త గిడ్డంగులు నిర్మిస్తామని, మూలపేటలో రైతులు, జిల్లాలోని మత్స్య కారుల సమస్యలు పరిష్కరించి, వలసలు నివారిస్తామని వివరించారు. జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచి, రాష్ట్రంలో నెంబర్ వన్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, డిఎస్డిఓ బి.శ్రీధర్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్కార్ - కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రేవంతన్న సర్కార్ నేటి నుండి ఆగస్టు 15 వరకు 2 లక్షల రుణమాఫీ చేయనున్నదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ... అన్నం పెట్టే రైతన్న అప్పుల ఊభి నుంచి బయటపడాలని సాగు క్షేత్రం వైపు సాగాలని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఒక బృహత్తర సాహసం రైతు రుణమాఫీ పథకం అన్నారు. నాడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సారథ్యంలో నేడు ప్రజా ప్రభుత్వ పాలనలో రాష్ట్ర రైతాంగానికి ఎంతో కష్టమైన ఎంత భారమైన ఏకకాలంలో రుణమాఫీ చేసి చూపిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి పంద్రాగస్టులోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తారని అన్నారు. ప్రజా ప్రభుత్వ నిర్ణయంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# ఆస్తిలో వాటా కోసం తండ్రిని హత్య చేసిన తనయుడు




అమరావతి, జులై 18 :ఆస్తిలో వాటా ఇవ్వలేదని తండ్రిని కారుతో ఢీకొట్టి తనయుడు హత్య చేసిన ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన మిరుగట్టు చిన్నరెడ్డప్పరెడ్డి (65)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రఘునాథరెడ్డి ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు శంకర్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెద్దకుమారుడు రఘునాథరెడ్డి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తూ రూ.16 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పుల వేధింపులు ఎక్కువవ్వడంతో తన తండ్రిని ఆస్తిలో వాటా ఇవ్వాలని కోరాడు. గత కొంతకాలంగా తండ్రీ కొడుకుల మధ్య ఈ వివాదం కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భోజనం చేశాక సమీపంలోని వాకింగ్ ట్రాక్‌పై నడుస్తున్న చిన్నరెడ్డప్పరెడ్డిని రఘునాథరెడ్డి నిలదీశాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన రఘునాథరెడ్డి తన కారుతో తండ్రిని ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని బెంగళూరులో ఉన్న సోదరుడికి ఫోన్ చేసి చెప్పాడు. శంకర్‌రెడ్డి స్థానికంగా ఉన్న బంధువులకు సమాచారం ఇవ్వడంతోపాటు పోలీసులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో బంధువులు, పోలీసులు రాత్రంతా చిన్నరెడ్డప్ప కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గురువారం తెల్లవారుజామున పట్టణంలోని వీవర్స్ కాలనీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో చిన్నరెడ్డప్ప మృతదేహాన్ని గుర్తించారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ యువరాజు వివరాలు సేకరించి మృతదేహాన్ని మదనపల్లె సర్వజన బోధనాసుపత్రికి తరలించారు. మృతుడి చిన్నకుమారుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు రఘునాథరెడ్డిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.

# ఎమ్మెల్యేలు ఉన్నా వెళ్లిపోయినా బీఆర్ఎస్‌కు పోయేదేమీ లేదు


## -కార్యకర్తలే మాకు కొండంత అండ : హరీశ్‌రావు

హైదరాబాద్ జూలై 18 (ఎక్స్‌ప్రెస్ న్యూ స్);ఎమ్మెల్యేలు ఉన్నా వెళ్లిపోయినా బీఆర్ఎస్‌కు పోయేదేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వైఎస్ హయాంలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కున్నారని గుర్తు చేశారు. అప్పుడు కూడా బీఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్‌కు ఏమీ కాలేదని, ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. మహిపాల్‌రెడ్డిని మూడుసార్లు ఎమ్మెల్యేను చేసిందని గుర్తు చేశారు. గూడెం వెళ్లిపోయినా.. బీఆర్ఎస్ కార్యకర్తలు గుండె ధైర్యంతో ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ నమ్ముకున్నది కార్యకర్తలను, ప్రజలను మాత్రమే అని స్పష్టం చేశారు. పార్టీ మారే ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టమన్నా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట తప్పారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఇప్పుడు విపక్ష ఎమ్మెల్యేలను లాక్కుంటున్నారని అన్నారు. కాగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరటం ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిష్టానం నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన మహిపాల్‌రెడ్డిని పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీముఖ్యం గా కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తుంది. అందుకే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమానికి కాటా శ్రీనివాస్‌గౌడ్ దూరంగా ఉన్నారు. కాటా వర్గానికి చెందిన నాయకులు బాహాటంగానే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై కాటా, మహిపాల్‌రెడ్డి అనుచరుల మధ్య సోషల్ మీడియా వేదికగా రెండురోజులుగా వార్ కొనసాగుతున్నది.

# మీ కోసం రెడ్ కార్పెట్ రెడీ.. ఐటీ కంపెనీలకు నారా లోకేష్ ఇన్విటేషన్

అమరావతి, జులై 18 :ఏపీలో ఐటీ, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్ విస్తరణకు నాస్కామ్‌కు ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం పలికారు. నాస్కామ్‌కు స్వాగతం పలికేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందంటూ ఆహ్వానం పంపారు..

కర్ణాటక ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024 పారిశ్రామిక బిల్లుపై నాస్కామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ సంస్థ నిరాశను ఏపీ ప్రభుత్వం అర్థం చేసుకుందన్న లోకేశ్.. ఏపీలో ఐటీ, ఐటీ సేవలు, ఏఐ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్ క్లస్టర్‌కి వ్యాపారాలను విస్తరించుకోవచ్చని నాస్కామ్‌కు లేఖ రాశారు. విశాఖలో ఏఐ, డేటా సెంటర్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం



ఉందని ప్రతిపాదనలో తెలిపారు. తమ వ్యాపారాలను ఆంధ్రప్రదేశ్ కు బదిలీ చేసుకోవచ్చని ఆహ్వానించారు. ఏపీలో పెట్టుబడులకు అత్యుత్తమ సౌకర్యాలు, నిరంతర విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాస్కామ్ ఐటీ సంస్థకు ప్రభుత్వం నుంచి పరిమితులు లేని నైపుణ్యం కలిగిన ప్రతిభను అందిస్తామని లోకేష్ వెల్లడించారు.

# భారత్ పాల ఎగుమతిలో ప్రపంచంలోనే మొదటి స్థానాన్ని చేరుకోవడమే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యం, అందుకోసం కృషి చేయండి: శ్రీ రాజీవ్ రంజన్ సింగ్

న్యూఢిల్లీ, జులై 18 :ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ 96వ వ్యవస్థాపక దినోత్సవం, టెక్నాలజీ డే 2024 ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ నేడు ఢిల్లీలో ప్రారంభించారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రులు శ్రీ భగీరథ్ చౌదరి, శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ జార్జ్ కురియన్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయితీరాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి.సింగ్ బఘేల్, వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ (ఐసీఏఆర్) శ్రీ హిమాన్షు పాఠక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ 96వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులతో కలిసి మొక్కను నాటారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ 96వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు 25 పంట రకాలను విడుదల చేసి, కొన్నింటిని రైతులకు అంకితం చేశారు. పశువులు, చేపల పెంపకానికి టీకా కిట్లను విడుదల చేశారు. పంట వ్యర్థాలతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను కూడా విడుదల చేశారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను కేంద్ర మంత్రులు సన్మానించడంతో పాటు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ కు చెందిన పలు ప్రచురణలను కూడా విడుదల చేశారు.

కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, దేశంలో చిన్న, సన్నకారు రైతుల కోసం మోడల్ ఫామ్(సాగు నమూనా) లను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయమే భారత ఆర్థిక వ్యవస్థకు ఆత్మ అని, రైతులే వెన్నెముక అని శ్రీ చౌహాన్ అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమని తెలిపారు. రైతాంగానికి, అన్నదాతలకు ప్రధాన మంత్రి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. వైవిధ్యభరితంగా వ్యవసాయాన్ని సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం సాధ్యమవుతుందని, ఆ సంకల్పంతోనే తాము పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

శాస్త్రవేత్తలు నాలుగేళ్లకు లక్ష్యాలను నిర్దేశించుకుని, నాలుగేళ్ల అనంతరం లక్ష్యాలు సాధించామని చెప్పాలని శాస్త్రవేత్తలకు శ్రీ చౌహాన్ ఉద్బోధించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తయారు చేయాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో, వ్యవసాయం, అనుబంధ రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. పశు పోషణ, చేపల పెంపకం, గోధుమల ఉత్పత్తి, పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాల్సిందిగా శాస్త్రవేత్తలకు కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

ఐసిఏఆర్ ఇప్పటివరకు 6 వేల పంటల రకాలను అందించిందని, అందులో ఎన్ని రకాలు పరిశోధనా కేంద్రం నుంచి వ్యవసాయ క్షేత్రానికి చేరాయని ప్రశ్నించారు. విజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా ఉపయోగించుకోవాలంటే రైతుకు, శాస్త్రవేత్తకు దగ్గరి సంబంధం ఉండాలని మంత్రి అన్నారు. ఇలా చేస్తే తప్ప రైతుకు ప్రయోజనం చేకూరదన్నారు. రైతుకు, కృషి విజ్ఞాన కేంద్రానికి ఎంతవరకు సంబంధం ఉందో విశ్లేషించుకోవాలి. దేశంలో ఉన్న 731 కృషి విజ్ఞాన కేంద్రాలలో, ఒక్కో కేంద్రానికి ఇద్దరు చొప్పున శాస్త్రవేత్తలను పంపి, వారు అక్కడ అధ్యయనం, పరిశోధనలు చేయాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని, వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజల్లో కూడా భారత్ స్వయం సమృద్ధి సాధిస్తుందని నేడు దీని కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. దీనికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పప్పుధాన్యాల కోసం సమృద్ధి పోర్టల్ ను రూపొందించారు. రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. శాస్త్రవేత్తలందరూ ఏడాదిలో నెల రోజుల పాటు పొలాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలి. అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు రైతాంగ అభివృద్ధి కోసం పాటుపడాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ క్షేత్రాలను అనుసంధానం చేయాలి. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంతో పాటు, పరిశోధనల ఫలితంగా మానవుల శరీరంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందనే దానిపై దృష్టి పెట్టడం కూడా ప్రధానమని మంత్రి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై కూడా పరిశోధనలు చేయాలని మంత్రి అన్నారు. శ్రీఅన్న ఉత్పత్తిని ఎలా పెంచాలనే దానిపై కూడా ప్రధాన మంత్రి ఆందోళన వ్యక్తం చేసినట్లు మంత్రి తెలిపారు. శ్రీ అన్న ఉత్పత్తిని పెంచడం కోసం పని చేయాల్సిందిగా శాస్త్రవేత్తలకు సూచించారు. స్వదేశీ జాతుల గుర్రాలు, కుక్కలను అభివృద్ధి చేయడంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. దీన్ని సాంకేతికతతో ఎలా అనుసంధానం చేయవచ్చు అనే దానిపై కూడా కసరత్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా కూడా పనిచేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఐసిఏఆర్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు వీలైనంత త్వరగా వాటిని అమలు చేస్తాయని, తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. స్థూల దేశీయోత్పత్తిలో పశుసంపద, చేపల పెంపకం 35 శాతం వాటాను అందిస్తున్నాయని, దీనిపై మరింత దృష్టి సారించకపోతే ఆ విలువ పడిపోతుందన్నారు. మనం ఈ రంగంపై దృష్టి పెడితే, 50 శాతానికి పైగా సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. చేపల పెంపకంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకున్న అంశాన్ని ప్రస్తావించారు. నేడు రూ.63 వేల కోట్ల విలువైన వస్తు ఎగుమతి చేస్తున్నాం. పశుసంపద, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. పశువుల్లో సంభవించే ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (ఎఫ్ఎండీ) నిర్మూలనలో పశుసంవర్ధక శాఖ నిమగ్నమైంది. ఈ వ్యాధి నుంచి విముక్తం చేయడంలో పరిశోధించాల్సిందిగా శాస్త్రవేత్తలను కోరారు. అనేక రాష్ట్రాలలో వ్యాధి తీవ్రతను, వ్యాప్తిని తగ్గించడానికి, భారతదేశంలో పశువులను ఎఫ్ఎండీ నుండి ఎలా విముక్తం చేయాలనే దానిపై పరిశోధిస్తున్నారు. వీర్య వర్గీకరణ, ఐవీఎఫ్ టెక్నాలజీపై కూడా పరిశోధన చేపట్టాలని, ఐవీఎఫ్‌ను చౌక ధరకు తీసుకురావడానికి ఐసీఏఆర్ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. దీనివల్ల రోడ్లపై వీధి జంతువుల నుండి విముక్తి చేయడంతో పాటు, పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పాడి పరిశ్రమలో కూడా చాలా పనులు జరిగాయి. పాడి పరిశ్రమ పూర్తిగా అసంఘటిత రంగమని, దీన్ని సంఘటిత రంగంలోకి తీసుకువస్తేనే పాడి పరిశ్రమను అభివృద్ధి చేయగలమని అన్నారు. పాల ఎగుమతుల్లో ప్రపంచంలోనే మొదటి స్థానానికి చేరుకోవాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, అందుకు కృషి చేయాలన్నారు. చేపల పెంపకం, వివిధ జాతుల చేపల ఎగుమతులను ఎలా పెంచాలో శాస్త్రవేత్తలు పనిచేయాలన్నారు. జలాంతర్గత చేపల వేట చేస్తే తప్ప ఎగుమతులను పెంచలేమన్నారు. వార్షిక ఎగుమతి లక్ష్యం రూ.63 వేల కోట్లకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధి, పంటల ఉత్పత్తి కోసం శాస్త్రవేత్తలు ఎంతో కృషి చేశారు. కానీ ఉత్పత్తి చేసిన ధాన్యాలకు నిల్వ సామర్థ్యాలు సరిగా లేవని, నిల్వ సామర్థ్యాలపై దృష్టిసారించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ అన్నారు. పంటల్లో విషపూరిత ఎరువుల వాడకాన్ని మానేసి, మనుషులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని మంత్రి అన్నారు. ఇందుకోసం శాస్త్రవేత్తలు విషరహిత ఎరువులపై పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎరువుల వాడకాన్ని దాదాపు వాడకుండా ఉండే దిశగా పరిశోధనలు ఉండాలని అన్నారు.

ఐసీఏఆర్ ప్రయోగశాల్లోనే కాకుండా పంటపొలాల్లో కూడా అనేక విధులను నిర్వర్తిస్తోందని, నేడు మనం దానిని మనం చూడగలుగుతున్నామని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయితీరాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి.సింగ్ బఘేల్ అన్నారు. ఐసీఏఆర్ కృషి ఫలితం మనకు ప్రతి ప్రతి రంగంలోనూ కనిపిస్తోందని మంత్రి అన్నారు. నానో యూరియా తయారీ ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు దోహదపడుతుందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే అనేక వ్యవసాయ విధానాలను ఐసిఏఆర్ తీసుకువచ్చింది. వీర్యం వర్గీకరణపై పరిశోధనల ద్వారా జన్మించే దూడలలో 90 శాతం ఆడ దూడలు ఉంటాయని బఘేల్ చెప్పారు.

140 కోట్ల మందికి అన్నం పెట్టే దేశంలోని రైతులను మనం పట్టించుకోకపోతే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌదరి అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతి సాధించింది. ఈ రంగంలో అభివృద్ధి సాధించడం ముఖ్యమే అయినప్పటికీ, దీని పర్యవసానాల ద్వారా మానవులకు ఎటువంటి సమస్య రాకూడదనేది మనం గుర్తుంచుకోవాల్సిన అంశం. నేడు డిజిటల్ విప్లవానికి పెద్దపీట వేయాల్సిన ఆవశ్యకత ఉంది. దేశంలో నూనెగింజలు, ఉత్పత్తి పెరిగినప్పటికీ దాన్ని మరింత పెంచాల్సిన అవసరాన్ని మంత్రి ఉద్ఘాటించారు. ప్రస్తుతం నీటి కొరత ఉందని, ఉత్పాదకతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వీటన్నింటి పట్ల రైతుల్లో అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

భారత్ చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా భారత్ ప్రపంచ వ్యవసాయ ఎగుమతిదారుగా మారేందుకు ఐసిఏఆర్ సహాయపడిందని డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు.

# అజిత్ పవార్‌కు షాక్.. ఎన్సీపీని వీడిన నలుగురు నేతలు

ముంబై జూలై 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు ఆయన వర్గం నేతలు షాక్ ఇచ్చారు. నలుగురు పార్టీ నేతలు రాజీనామా చేశారు. శరద్ పవార్ వర్గంలో వారు చేరనున్నట్లు తెలుస్తున్నది. ఎన్సీపీకి చెందిన పింప్రి–చించ్వాడ్ యూనిట్ చీఫ్ అజిత్ గవాహనే, విద్యార్థి విభాగం అధ్యక్షుడు యశ్ సానే, మాజీ కార్పొరేటర్లు రాహుల్ భోసలే, పంకజ్ భలేకర్ తమ రాజీనామాలను అజిత్ పవార్‌కు సమర్పించారు. భోసారి అసెంబ్లీ స్థానానికి టికెట్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో అజిత్ గవాహనే రాజీనామా చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్ లాంగే గత రెండు దఫాలుగా భోసారి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఈసారి కూడా ఆయనే పోటీ చేస్తారని తెలుస్తు న్నది.కాగా, అజిత్ పవార్ వర్గానికి చెందిన కొందరు నేతలు శరద్ పవార్ వర్గంలోకి తిరిగి వెళ్లేందుకు సుముఖంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా ఎన్సీపీకి కంచుకోటగా ఉన్న పింప్రి–చించ్వాడ్‌కు చెందిన నలుగురు నేతలు రాజీనామా చేయడం అజిత్ పవార్ వర్గానికి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. శరద్ పవార్ ఎన్సీపీ వర్గంలో వీరు చేరుతారని సమాచారం.మరోవైపు మహారాష్ట్ర మంత్రి, సీనియర్ ఎన్సీపీ నేత ఛగన్ భుజ్‌బల్ కూడా అజిత్ పవార్‌ను విడిచిపెట్టనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల శరద్ పవార్‌ను ఆయన ఇంట్లో కలిశారు. మహా వికాస్ అఘాడిలో భాగమైన శివసేన (యూబీటీ) నేతతో కూడా గత నెలలో ఆయన సమావేశమయ్యారు.

# రాజకీయ లబ్ధికి గట్టు పంచాయతీనా-..హరీష్ పై మండిపడ్డ నీలం మధు




మెదక్, జులై 18 :ఇద్దరు రైతుల మధ్య గట్టు పంచాయతీని రాజకీయాల అభివృద్ధికి వాడుకోవడం సిగ్గుచేటని మెదక్ పార్లమెంట్ కంటెస్టెంట్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ కు చెందిన రైతు కిష్టయ్యను గురువారం కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి పరామర్శించారు.

భూమి పంచాయతీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కిష్టయ్యకు మెరుగైన వైద్య సహాయం అందించాలని డాక్టర్లకు సూచించారు. తక్షణ సహాయం కింద లక్ష (1,00,000) రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నీలం మధు మీడియాతో మాట్లాడుతూ? ఇద్దరు రైతుల మధ్య ఉన్న చిన్న భూపంచాయతీని అదునుగా చేసుకొని మాజీ మంత్రి హరీష్ రావు రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు. గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దమ్మక్క పల్లికి చెందిన రైతు కిష్టయ్యకు పక్కన రైతుతో గట్టు పంచాయతీ ఉండడంతో సర్వే నిర్వహించారని, అయితే పక్క రైతు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సర్వేలో తనకు అన్యాయం జరిగిందని రైతు కిష్టయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడడం బాధాకరమన్నారు.

అయితే ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు రాజకీయ లబ్ధికి వాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేసి కుట్ర చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు ప్రాణాపాయ స్థితిలో ఉంటే రాజకీయ లబ్ది పొందడానికి ప్రయత్నం చేయడం సరికాదని, ఇకనైనా ఈ దుర్మార్గపు కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో గజ్వేల్ నియోజకవర్గంలో ఎంతమంది రైతుల ఉసురు పోసుకున్నారో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. మీరు పెట్టే గోసలు భరించలేక చితి పేర్చుకొని మంటల్లో రైతు సజీవ దహనం ఘటనను మాజీ మంత్రి గుర్తు తెచ్చుకోవాలన్నారు.

ప్రజలు బీఅర్ఎస్ పార్టీని తిరస్కరించినా మాజీ మంత్రి హరీష్ రావుకు జ్ఞానోదయం కలగకపోవడం విడ్డూరమన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు ఆపకపోతే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నామరూపాలు లేకుండా గల్లంతు చేస్తారని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని వివరించారు. రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నిరంతరం రైతు సంక్షేమమే ఎజెండాగా పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కిష్టయ్యకు అన్ని విధాలుగా అండగా నిలబడుతుందన్నారు. భూ పంచాయతీకి సంబంధించి అధికారులతో మాట్లాడి సర్వే నిర్వహించి కిష్టయ్యకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఇకనైనా మాజీ మంత్రి హరీష్ రావు అబద్ధపు ప్రగల్భాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు లింగా రావు, రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్, నవీర్, మతిన్, తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రౌండ్ వాటాదారుల సలహా కమిటీల సమావేశాలను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ, జులై 18 :మొదటి రోజు జరిగిన ఫలవంతమైన చర్చల అనంతరం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని ల నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన ఆరు వాటాదారుల సలహా కమిటీలు (ఎస్.ఎ.సి.ల) ప్రారంభ సమావేశాలను టెలికమ్యూనికేషన్స్ శాఖ (డి.ఓ.టి.) కొనసాగించినది. రెండవ రోజు, టెలికమ్యూనికేషన్స్ ఎకో సిస్టమ్ కోసం కీలకమైన మరిన్ని అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల ఎస్.ఎ.సి., ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ ఎస్.ఎ.సి.; అలాగే విద్యావేత్తలు మరియు టెలికమ్యూనికేషన్స్ రంగంలోని రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్.ఎ.సి. అను మూడు ఎస్.ఎ.సి.ల సభ్యులతో నేటి సమావేశాలు జరిగాయి.

ఈ సమావేశంలో డాక్టర్ నీరజ్ మిట్టల్, కార్యదర్శి, టెలికమ్యూనికేషన్స్ విభాగం (డి.ఓ.టి.), శ్రీమతి మధు అరోరా, సభ్యులు (టెక్నాలజీ), శ్రీ మనీష్ సిన్హా, సభ్యులు (ఫైనాన్స్), అలాగే పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను ప్రోత్సహించుట, ఆర్ అండ్ డి, టెలికాం ఉత్పత్తుల కోసం గో–టు–మార్కెట్ వ్యూహాలు, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం, మానుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్ ప్రారంభించడం, పరిశ్రమ –విద్యాసంబంధ సంస్థల అనుసంధానాలు, కొత్త ఆలోచనలు పంచుకోవడం, విధానపరమైన సమస్యలను పరిష్కరించుట సహా పలు కీలక అంశాలను గురించి ప్రభుత్వంతో టు–వే సంభాషణను సులభతరం చేయడానికి ఈ కమిటీలు రూపొందించబడ్డాయి. కొత్త ఆలోచనలు మరియు విధాన సమస్యలను పరిష్కరించడం వంటి కీలక విషయాలను గురించి ప్రభుత్వంతో పరస్పర చచర్చల అనంతరం శ్రీ సింధియా మీడియాతో మాట్లాడుతూ, “మేము ఈ మూడు కమిటీల కోసం లోతైన అజెండాను గుర్తించాము. ఇప్పుడు, మేము ఈ కమిటీల సభ్యులతో కలిసి పని చేస్తాము. రాబోయే రెండు వారాల్లో ఈ కమిటీల మొదటి ప్రజెంటేషన్ కోసం వివిధ షెడ్యూల్స్ ఉన్నాయి. ఆపై మేము ఒక్కొక్కటిగా సమస్యను తీసుకుని, దాని వివరాలను పరిశీలించి, స్పష్టమైన కాలపరిమితులు, చర్యలు తీసుకోవాల్సిన అంశాలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాము, ఆ విధంగా మేము మా రంగాన్ని ముందుకు తీసుకెళ్లగలము” అన్నారు.

2వ రోజు ప్రధాన అంశాలు

టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ ఎస్.ఎ.సి.: టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ ఎస్.ఎ.సి. అందించే సేవలను మెరుగుపరచడం, టెలికాం ఆపరేటర్స్ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం కోసం అవసరమైన వ్యూహాలను గురించి చర్చించింది. అభివృద్ధి గురించిన అత్యాధునిక వినూత్న అంశాలు సహా పరిశ్రమకు సంబంధించిన వివిధ అంశాలతో ముడిపడి ఉన్న కీలక సమస్యలను గురించి చర్చించారు.

ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ ఎస్.ఎ.సి.: బ్రాడ్‌బ్యాండ్ విస్తరణను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రత్యేకించి ఫైబర్ ఆప్టిక్స్, 5జి వంటి అధునాతన సాంకేతికతల విస్తరణ ఆవశ్యకతను వివరిస్తూ, మౌలిక సదుపాయాల విస్తరణను వేగవంతం చేయడం, ఇంటర్నెట్ యాక్సెసిబిలిటీని మెరుగుపంచడంలో విధానపరమైన మద్దతు అవసరాన్ని కమిటీ ప్రధానంగా ప్రస్తావించింది, నొక్కి చెప్పింది.

విద్యావేత్తలు మరియు టెలికమ్యూనికేషన్స్ రంగంలోని ఖీ డ ఆ ఎస్.ఎ.సి. : విద్య, టెలికాం రంగాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. టెలికాం రంగానికి నూతన ఆవిష్కరణలు, నైపుణ్యం కలిగిన సిబ్బందిని అభివృద్ధి చేయడంలో ఈ రెండు రంగాల భాగస్వామ్య ప్రాముఖ్యతను కమిటీ ప్రధానంగా ప్రస్తావించింది.

పరిశ్రమల ప్రముఖులు, విద్యాసంస్థల నిరంతర భాగస్వామ్య ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, ఎస్.ఎ.సి.ల సూచనలు సాంకేతిక పురోగతి, విధాన సంస్కరణలకు మాత్రమే కాకుండా, భారతదేశ టెలికమ్యూనికేషన్స్ రంగం యొక్క సర్వతోముఖ వృద్ధికి కూడా సహాయపడతాయని పేర్కొన్నారు.

అంతకుముందు, శ్రీ సింధియా 2024, జూలై 15న శాటిలైట్ కమ్యూనికేషన్ ఎకోసిస్టమ్ ఎస్.ఎ.సి., టెలికాం సెక్టార్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు (ఓ.ఇ.ఎమ్‌లు), టెలికాం ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ ఎస్.ఎ.సి.ల సభ్యులతో చర్చలు జరిపారు.

టెలికమ్యూనికేషన్స్ శాఖ ఈ చర్చల ఫలితాలను కొనసాగించడానికి కట్టుబడి ఉంది, అలాగే ఈ సమావేశాల ద్వారా సూచనలపై చురుకుగా పని చేస్తుంది. టెలికాం రంగ అభివృద్ధి కోసం సిఫార్సులను అమలు చేయడం, ఉత్పాదక, వినూత్న వాతావరణాన్ని పెంపొందించడం డి.ఓ.టి. లక్ష్యం. మేము ఈ సంప్రదింపు ప్రక్రియలో ముందుకు సాగే క్రమంలో వాటాదారులందరి సహాయ సహకారాలు చాలా కీలకం.

”ఈ కమిటీల ఏర్పాటు ద్వారా, ‘ఆత్మ నిర్భర్ భారత్’ మాత్రమే కాకుండా, రాబోయే రోజుల్లో మన పరిమితులను అధిగమించి భారతదేశంలో టెలికాం సూపర్ పవర్‌ను సృష్టించాలన్న ప్రధానమంత్రి లక్ష్యం స్ఫూర్తిగా, ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లగలమని మేము ఆశిస్తున్నాము,” అని పేర్కొనం ద్వారా భారత కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా వాటాదారుల సలహాల కమిటీల (ఎస్.ఎ.సి.ల) చివరి సమావేశాన్ని ముగించారు. వాటాదారుల సలహాల కమిటీల తదుపరి సమావేశాలు ఆగస్టులో నిర్వహించబడుతాయి, ఈ ప్రారంభ సెషన్ ప్రాతిపదికగా తదుపరి చర్చలు కొనసాగుతాయి.

# ఉన్నత విద్య కోసం భారతీయ భాషలో పాఠ్యపుస్తకాల రచనపై వర్క్ షాప్ ను ప్రారంభించిన డాక్టర్ సుకాంత మజుందార్

న్యూఢిల్లీ, జులై 18 :ఉన్నత విద్య కోసం భారతీయ భాషలో పాఠ్యపుస్తకాల రచనపై వైస్ ఛాన్సలర్ల ఒక రోజు వర్క్ షాప్ ను కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ మంగళవారం ఢిల్లీలో ప్రారంభించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజీసి), భారతీయ భాషా సమితి (బి బి ఎస్) సంయుక్తంగా ఈ వర్క్ షాప్ ను నిర్వహించాయి.

విద్యా మంత్రిత్వ శాఖ లోని ఉన్నత విద్యా శాఖ విభాగం కార్యదర్శి కె.సంజయ్ మూర్తి; భారతీయ భాషా సమితి చైర్మన్ ప్రొఫెసర్ చాము కృష్ణశాస్త్రి; యు జి సి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.జగదీశ్ కుమార్ , 150కి పైగా విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్ లర్లు, ప్రముఖ విద్యావేత్తలు, ఇతర ప్రముఖులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు.

వివిధ ఉన్నత విద్యా కోర్సులకు భారతీయ భాషల్లో స్టడీ మెటీరియల్ ను సిద్ధం చేయవలసిన అవసరాన్ని వర్క్ షాప్ ప్రారంభ సెషన్ లో డాక్టర్ సుకాంత మజుందార్ వివరించారు. విద్యావిధానం దేశంలోని విస్తారమైన భాషా వైవిధ్యాన్ని ప్రతిబింబించాలని, విద్యార్థులకు వారి మాతృభాషల్లో విజ్ఞానం అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ‘వికసిత్ భారత్’ లక్ష్యాన్ని నెరవేర్చడంలో దార్శనిక నాయకత్వాన్ని అందించినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ విద్యావిధానం 2020 దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా యువతను ప్రేరేపించడానికి పునాది వేస్తుందని డాక్టర్ మజుందార్ అన్నారు. ఎన్ ఇ పి 2020 అమలును ముందుకు తీసుకువెళ్ళినందుకు శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భారతీయ భాషలు దేశ ప్రాచీన చరిత్రకు, తరతరాలుగా సంక్రమించిన జ్ఞానానికి నిదర్శనాలని డాక్టర్ మజుందార్ అన్నారు. యువ తరాలను సంరక్షించుకోవాలని, సుసంపన్న సాంస్కృతిక, భాషా వారసత్వంపై వారి నమ్మకాన్ని బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ చాము కృష్ణ శాస్త్రి భారతీయ భాషా పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. శ్రీ ఎం.జగదీష్ కుమార్ కొన్ని విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు.

ముగింపు సమావేశంలో శ్రీ కె.సంజయ్ మూర్తి మూడు ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించారు. అవి అస్మిత ( ఆగ్మెంటింగ్ స్టడీ మెటీరియల్స్ ఇన్ ఇండియన్ లాంగ్వేజెస్ త్రూ ట్రాన్స్ లేషన్ అండ్ అకడమిక్ రైటింగ్– అనువాదం, అకడమిక్ రచన ద్వారా భారతీయ భాషలలో స్టడీ మెటీరియల్ ను పెంచడం); బహుభాషా నిఘంటువులను సృష్టించడానికి బహుభాషా శబ్దఖోష్ ; అనువాద సామర్థ్యాలను పెంపొందించడానికి రియల్ టైమ్ ట్రాన్స్ లేషన్ ఆర్కిటెక్చర్. ఈ ప్రాజెక్టులన్నింటికీ రూపకల్పన చేయడంలో ప్రధాన పాత్ర టెక్నాలజీ అని, వీటిలో ఎన్ ఇ టి ఎఫ్, బి బి ఎస్ లు కీలక పాత్ర పోషిస్తాయని శ్రీ మూర్తి అన్నారు.

భారతీయ భాషా సమితి సహకారంతో యు జి సి నేతృత్వంలోని అస్మిత కింద వచ్చే ఐదేళ్లలో 22 షెడ్యూల్డ్ భాషల్లో 22000 పుస్తకాలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సిఐఐఎల్ ) ఆధ్వర్యంలో బహుభాషా శబ్దఖోష్ కింద భారతీయ భాషా సమితి సహకారంతో బహుభాషా నిఘంటువుల బృహత్తర భాండాగారాన్ని రూపొందించేందుకు విస్తృత చొరవ తీసుకుంటున్నారు. భారతీయ భాషా సమితి సహకారంతో నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరం (నెఫ్ట్) నేతృత్వంలో రియల్ టైమ్ ట్రాన్స్ లేషన్ ఆర్కిటెక్చర్ భారతీయ భాషలో రియల్ టైమ్ అనువాద సామర్థ్యాలను పెంచడానికి సాంకేతిక దృక్కోణం సృష్టించడానికి దోహదపడుతుంది.

దేశవ్యాప్తంగా 150 మందికి పైగా వైస్ చాన్స్ లర్లు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. వైస్ ఛాన్సలర్లను 12 మేథో మదన బృందాలుగా విభజించారు. ఒక్కొక్క బృందం 12 ప్రాంతీయ భాషల్లో పాఠ్యపుస్తకాల తయారీ ప్రణాళికలు రూపొందించడానికి , అభివృద్ధి చేయడానికి అంకితమయ్యారు. ముందుగా దృష్టి సారించిన భాషల్లో పంజాబీ, హిందీ, సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, తెలుగు, ఒడియా భాషలు ఉన్నాయి. ఆయా నోడల్ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ ల అధ్యక్షతన ఈ బృందాలు జరిపిన చర్చలు విలువైన ఫలితాలను ఇచ్చాయి.

భారతీయ భాషలో కొత్త పాఠ్యపుస్తకాల సృష్టిని నిర్వచించడం, పుస్తకాలకు 22 భారతీయ భాషల్లో ప్రామాణిక పదజాలాలను ఏర్పాటు చేయడం, ప్రస్తుత పాఠ్యపుస్తకాలకు మెరుగుదల అవకాశాలను గుర్తించడం, ఆచరణాత్మక , సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ భారతీయ విజ్ఞాన వ్యవస్థలను (ఐకెఎస్) ఒక మూలాంశంగా స్పష్టం చేయడం పై ప్రధానంగా చర్చల్లు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్ లో ప్రశ్నలకు ప్యానెల్ సమాధానాలు ఇచ్చింది.

# మైసమ్మ గూడలో మొక్కలు నాటిన ఎంపీ, ఎమ్మెల్యే..



హైదరాబాద్, జులై 18 : మేడ్చల్ నియోజకవర్గం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మ గూడలో వన మహోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మల్కాజ్ గిరి ఎంపి ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు.

తమవంతుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌కు చెందిన సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) 73వ వ్యవస్థాపక దినోత్సవం

న్యూఢిల్లీ, జులై 18 :కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) 73వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఢిల్లీలోని సీఆర్ఆర్ఐ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ కలైసెల్వి, కార్యదర్శి, డీఎస్ఐఆర్, డైరెక్టర్ జనరల్ సీఎస్ఐఆర్, ఇతర ప్రముఖుల హాజరయ్యారు.

ఈ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి, సీఎస్ఐఆర్ 26వ డైరెక్టర్ జనరల్, 80 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థకు తొలి మహిళ డీజీ డా. ఎన్ కలైసెల్వి హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా ‘ఏసీఎస్ఐఆర్ పీహెచ్‌డీ స్కాలర్ ల్యాబ్’ను డాక్టర్ కలైసెల్వి ప్రారంభించారు. అనంతరం ఆమె కీలక ఉపన్యాసం చేస్తూ, తన విలువైన మార్గదర్శకత్వాన్ని సభలో పాల్గొన్నవారితో పంచుకున్నారు. సీఆర్ఆర్ఐ సాంకేతిక ప్రయోజనాలను, స్థానిక, మానవ వనరులను ఉపయోగించి రాబోయే రెండు, మూడేళ్లలో భారత భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని ఆమె తెలిపారు. ఏసీఎసఐఆర్ ప్రైవేట్, పూర్వ విద్యార్థుల సహకారం అవసరాన్ని డా. కలైసెల్వి సమావేశంలో పేర్కొన్నారు.

సీఆర్ఆర్ఐ డైరెక్టర్, ప్రొఫెసర్ మనోరంజన్ పరిదా మాట్లాడుతూ, ఎడ్లబండిలో సాంకేతికత నుంచి మొదలు బయో బైండర్ వరకు అనేక అంశాల్లో సీఎస్ఐఆర్ఐ–సీఆర్ఆర్ఐ సంస్థ పాత్రను కొనియాడారు. కాంప్రహెన్సివ్ ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్, ఐఆర్‌టీఈ, వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వివిధ రంగాల్లో ఆటో ఫ్యూయల్ విధానాల వంటి వాటిల్లో సంస్థ పాత్రను ఆమె కొనియాడారు.

సిఆర్ఆర్ఐ మొదటి డైరెక్టర్ ఎర్నెస్ట్ జిప్కేస్ ఈ సంస్థ స్థాపనకు దోహదపడిన తీరును డాక్టర్ రవీంద్ర కుమార్ గుర్తు చేశారు. 1943లో నాగ్‌పూర్ లో జరిగిన చీఫ్ ఇంజినీర్ల సదస్సులో సీఆర్ఆర్ఐ ఏర్పాటు ఆలోచనను తొలిసారిగా చర్చించారు. 1952 జూలై 16లో సీఎస్ఐఆర్ తొలి డైరెక్టర్ జనరల్ అయిన శ్రీ శాంతి స్వరూప్ భట్నాగర్ మార్గదర్శకత్వంలో 1950 మార్చిలో సీఎస్ఐఆర్ కార్యవర్గ సంఘం ఆమోదించింది.

73వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, రోడ్డు, రవాణా పరిశోధన రంగంలో రేపటి తరం శాస్త్రవేత్తలను ప్రేరేపించడానికి ఒక వేదికగా నిలిచాయి. ఈ వేడుకల్లో పాల్గొన్నవారందరిలో ఉత్సాహం, అంకితభావాన్ని గుర్తిస్తూ, కృతజ్ఞతలతో కార్యక్రమం ముగిసింది. సీఎస్ఐఆర్ జిగ్యాస పథకం కింద 200 మందికి పైగా పాఠశాల విద్యార్థులు సీఆర్ఆర్ఐ ఓపెన్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఢిల్లీ సాంకేతిక విశ్వవిద్యాలయ ఉపకులపతి, ప్రొఫెసర్ ప్రతీక్ శర్మ, సుస్థిరాభివృద్ధి సవాళ్లకు ఇంజినీరింగ్ సమాధానాలు అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా పరిశ్రమలతో పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. విద్వస్ 2024లో విద్యార్థులు తమ పరిశోధనలను పోస్టర్ల రూపంలో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేశారు. డాక్టర్ వినోద్ క్రార్ ఈ కార్యక్రమాలను నిర్వహించారు. శాస్త్రీయ పరిశోధన, విద్యలో సమర్థతను ప్రేరేపించడానికి కారకులైన వారి సేవలు చిరస్మరణీయమని, ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సిఎస్ఐఆర్–సిఆర్ఆర్ఐ కృతజ్ఞతలు తెలియజేసింది.

# మేడిపల్లిలో కన్న కూతురిపై కీచక తండ్రి లైంగిక దాడి

- మేడిపల్లి పోలీసుల అదుపులో నిందితుడు
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

మేడిపల్లి జూలై 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన కీచకుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?.. మేడిపల్లిలోని సాయి నగర్ లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. హస్టల్ లో ఉండి చదువుకుంటున్న తన మైనర్ కూతురును ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో తల్లి లేని సమయంలో బాలికపై బలాత్కారం చేశాడు. అనంతరం జరిగిన విషయం పక్కింటి మహిళకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ రోజు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరద.. వరద నీటిలో చిక్కుకున్న 30 మంది కూలీలు

భద్రాద్రి కొత్తగూడెం, జులై 18 : రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం పరిధిలోని పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. అధికారులు గేట్లు ఎత్తివేయడంతో ప్రాజెక్టు దిగువ భాగంలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెంలోని నారాయణపురం వద్ద 20 మంది కూలీలు వరదలో చిక్కుకున్నారు. సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. బాధితులను రక్షించేందుకు సీఎంవోతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సంప్రదింపులు జరిపారు. హెలికాప్టర్ ద్వారా బాధితుల్ని రక్షించాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం, రెస్క్యూ టీమ్ సహాయ చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల సూచించారు.

గురువారం తెల్లవారుజాము నుంచి భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఎడతెరపి లేకుండా వానకురుస్తున్నది. దీంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం 21 అడుగులకు చేరింది. చర్ల వద్ద రహదారి పైకి నీరు చేరడంతో రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై పైకి మూడు అడుగుల మేర వర్షం నీరు చేరడటంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాలు పడే సమసమయ్యంలో చెట్ల కింద ఉండకూడదని, అవసరమైతే తప్పా బయటకు వెళ్లొద్దన్నారు. భారీ వర్షాలతో సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం గనుల్లో 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సింగరేణి జీకేలో 5 ఓపెన్‌కాస్ట్ గనుల్లో వెయ్యి టన్నులు, ఇల్లందు, కోయగూడెం ఓపెన్‌కాస్టుల్లో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

# దుస్తులు పంపిణీచేసిన రాయల నాగేశ్వరరావు



ఖమ్మం, జులై 18 :(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పని చేస్తున్న వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పని చేస్తున్న వారు రాయల నాగేశ్వరరావుని ఆప్యాయంగా పలుకరించేవారు. చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత నాగేశ్వరరావు వారికి దుస్తులు అందించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# గంజాయికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు-ఏఎస్పీ అంకిత్ కుమార్




ఖమ్మం, జులై 18 :యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, డ్రగ్స్, గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ అన్నారు. భద్రాచలం పట్టణంలో మత్తు పదార్థాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం భద్రాచలం ఆటో డ్రైవర్స్ తో కలిసి స్థానిక బస్టాండ్ నుండి అంబెడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ సెంటర్ లో మానవహారం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? ఎవరైనా గంజాయి అమ్మితే ఉపేక్షించేది లేదని, కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. గంజాయి అమ్మే వారి పట్ల తగిన సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, యువత గంజాయి అమ్ముతూ పట్టుబడితే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులని, తీవ్ర నేరంగా పరిగణించబడుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి యువత వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్సై విజయలక్ష్మి, మధుప్రసాద్, పోలీస్ సిబ్బందితో పాటు ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాలి

**– ఉద్యమకారులు డాక్టర్ కె.వి.కృష్ణారావు**

ఖమ్మం, జులై 18 :(నేటినిజం ప్రతినిధి): ఈనెల 24 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాలని సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారులు కె.వి.కృష్ణారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే 24 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటనచేసి మరోచరిత్ర తిరగరాయాల ని ఆయన అన్నారు. గుర్తింపు ప్రక్రియ ఇప్పటికే ఆలస్యమైందని వెంటనే గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేసి తెలంగాణ సాధకులుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని ఆయన అన్నారు. మంత్రులు ప్రకటిస్తున్నట్లుగా అమరుల కుటుంబాలతో పాటు ఉద్యమ సాధకులకు కూడా 25వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆ 'డి ఎం హెచ్ వో' కు మంత్రి దామోదర అభినందనలు ..

హైదరాబాద్, జులై 18 : కిలోమీటర్ల కొద్దీ అడవుల్లో నడిచి వెళ్లి గిరిజనులకు స్వయంగా వైద్యసేవలు అందించిన ములుగు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్యకు తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. కొండలు ఎక్కి, వాగులు దాటి ఆదివాసీలకు వైద్యసేవలు అందించడాన్ని స్వాగతిస్తూ డీఎంహెచ్‌వో సేవలను కొనియాడారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నిర్మూలనకు వైద్యులు, వైద్యాధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని రాజనర్సింహ తెలిపారు. విశేషంగా సేవలందిస్తున్న వైద్యులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ములుగు డీఎంహెచ్‌వోను ఆదర్శంగా తీసుకుని ఇతర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజనులకు వైద్యసేవలు అందించాలన్నారు.

# ఆరు సెషన్లలో జూమ్.. రూ.76 వేలు దాటిన బంగారం ధర..

హైదరాబాద్, జులై 18 :దేశీయంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో బులియన్ మార్కెట్లో బంగారం ధర ధగధగ మెరుస్తున్నది. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో పది గ్రాముల బంగారం (24 క్యారట్స్) ధర రూ.700 వృద్ధి చెంది రూ.76,400లకు దూసుకెళ్లింది. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ తగ్గడం కూడా బంగారం ధర పెరుగడానికి కారణం. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వద్ద అందు బాటులో ఉన్న ధరల ప్రకారం బుధవారం తులం బంగారం ధర (24 క్యారట్స్) రూ.75,700లతో ముగిసింది.

వరుసగా ఆరు సెషన్లలో బంగారం ధర పెరగడంతో దేశ రాజధానిలో గురువారం తులం ధర రూ.76,400లకు చేరుకున్నది. మరోవైపు కిలో వెండి ధర రూ.400 తగ్గి, రూ.94 వేలకు పడిపోయింది. బుధవారం కిలో వెండి ధర రూ.94,400 వద్ద స్థిర పడింది. గురువారం అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ ఆరు పైసలు పతనమై జీవిత కాల కనిష్టం రూ.83.64లకు పతనమైంది.అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ లో ఔన్స్ బంగారం ధర 6.90 డాలర్లు వృద్ధి చెంది 2466.80 డాలర్లు పలికింది. వచ్చే సెప్టెంబర్ నెలలో వడ్డీరేట్లు తగ్గిస్తామని యూఎస్ ఫెడ్ రిజర్వు ప్రకటించడంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# పెబ్బేరు గ్రామస్తులకు హ్యాట్సాఫ్ : మాజీ ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్, జులై 18 :గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పెబ్బేరు గ్రామస్తులపై ప్రశంసల వర్షం కురిపించారు. 50 ఏండ్ల నాటి జమ్మిచెట్టుకు ప్రాణం పోయడంపై పెబ్బేరు గ్రామస్తులకు సంతోష్ హ్యాట్సాఫ్ చెప్పారు.

వనపర్తి జిల్లా పెబ్బేరులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించిన 50 ఏండ్ల నాటి జమ్మిచెట్టును స్థానికంగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో తిరిగి నాటారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించడంలో పెబ్బేరు గ్రామస్తుల అంకితభావం కనబడుతుందని సంతోష్ తెలిపారు. ఆ గ్రామ ప్రజలను మనం కూడా అనుసరించి, హరిత వారసత్వాన్ని కాపాడుకుందామని మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు.

# మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి : ఎమ్మెల్యే తలసాని



అమీర్‌పేట్, జూలై 18 : భూమి మీద పచ్చదనం కనుమరుగవుతున్న నేపథ్యంలో పర్యావరణ సమతుల్యం లోపిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరిస్తే భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు వీలవుతుందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ, రవీంద్రనగర్‌లోజరిగిన వన మహోత్సవంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయ్‌సింగ్‌లతో కలిసి పాల్గొని మొక్కలు నాటారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. రవీంద్రనగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి అధ్యక్షులు విజయ్‌సింగ్ సహా కాలనీ నివాసితులు చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. అయితే గతంలో తాను మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిధులేమి సాకు చూపుతూ పక్కన పెట్టడం దివాళాకోరు విధానామ న్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ఇందిర, డీఈ మోహన్, జలమండలి ఈఈ హరిశంకర్, బీఆర్ ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దాడి ప్రవీణ్‌రెడ్డి, పుట్టల శేఖర్, పుష్పలత, సనితగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలపై కేంద్రంపై మిలిటెంట్ పోరాటానికి సిద్ధం : ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, జులై 18 :ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీలకు సామాజిక న్యాయం చేయకపోతే కేంద్రంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని ప్రకటించారు. గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో జాతీయ బీసీ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్.కృష్ణయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హాజరయ్యారు.

అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ సమస్యల సాధనకై ఆగస్టు 5,6,7 తేదీలలో జాతీయ బీసీ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో వేలాది మందితో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం జనాభా దమాషా ప్రకారం బీసీలకు రిజర్వేన్లు కల్పించాలని, అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. వీహెచ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నీల వెంకటేశ్, నందగోపాల్, వి.రామకృష్ణ, జి.మల్లేశ్, ఉదయ్, జయంతి, జ్యోతి, కరుణాశ్రీ, శివమ్మ, అంజి, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు: కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జులై 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం మెదక్ జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు వర్తించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రైతు రుణమాఫీపై బ్యాంకు కంట్రోలర్స్ బ్యాంకు మేనేజర్ తో గూగుల్ మీట్ సమీక్ష నిర్వహించి జిల్లాలో ఉన్న రైతు రుణాల వివరాలు బ్యాంకుల వారీగా, వ్యవసాయ సహకార సంఘాల వారీగా కలెక్టర్ తెలుసుకున్నారు.

సమీక్షలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడత కింద మన జిల్లాలో లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న45వేల 882 మంది రైతుల241.82 కోట్ల రూపాయల రుణాల సోమ్మును ప్రభుత్వం ఈ రోజు జమ చేస్తుందని, సంబంధిత రైతులకు రైతు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. మొదటి దశలో జరుగుతున్న రుణమాఫీ లబ్ధిదారుల జాబితా, పూర్తి స్థాయి లబ్ధిదారుల జాబితాతో లీడ్ బ్యాంకు మేనేజర్ బ్యాంకు వారీగా రీకన్సైల్ చేయాలని, లీడ్ బ్యాంక్ మేనేజర్ కు పూర్తి స్థాయిలో బ్యాంకులు సమాచారం అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

12-12-2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలకు 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకుల ద్వారా రైతులు చేసిన రుణాలను సైతం ప్రభుత్వం మాఫీ చేస్తుందని, ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ సోమ్ము వినియోగంపై, ఫెయిల్డ్ ట్రాన్సాక్షన్ వివరాలు ప్రతిరోజు రిపోర్టును అధికారులు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

వ్యవసాయ శాఖ తరపున సీనియర్ అధికారిని జిల్లాలో రుణమాఫీ గురించి వివరాలు అధికారిగా కేటాయించి ప్రభుత్వం విడుదల చేసిన సొమ్ము సాఫీగా రైతులకు చేరేలా చూడాలని, ప్రతి మండల కేంద్రంలో బ్యాంకర్ల వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి రుణమాఫీకి సంబంధిత వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ ఎల్ డి ఎం, నరసింహమూర్తి, బ్యాంకు కంట్రోలర్స్ బ్యాంక్ మేనేజర్లు కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్‌ను ప్రారంభించిన మహీంద్రా యూనివర్సిటీ




హైదరాబాద్, జులై 18 :మహీంద్రా విశ్వవిద్యాలయం ఈరోజు హైదరాబాద్‌లో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. పినిన్‌ఫరినా డిజైన్ అకాడమీ, టొరినో, ఇటలీ మరియు షెనోయ్ ఇన్నోవేషన్ స్టూడియో ఐడిసి ఐఐటీబీ తో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. మొదటి అకడమిక్ సెషన్ 15 ఆగస్టు 2024న బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్‌తో ప్రారంభమవుతుంది. మహీంద్రా యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి మాట్లాడుతూ, "భారతదేశం తన ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా సాంకేతిక వృద్ధి యొక్క తదుపరి దశ వైపుగా వెళ్తున్న వేళ, కొత్త నైపుణ్యాలు మరియు సామర్థ్యాలు అవసరమయ్యే కొత్త సాంకేతికతలను స్వీకరించడంలో విపరీతమైన వృద్ధిని చూస్తున్నాము. విద్యలో శ్రేష్ఠత మరియు ఆవిష్కరణల వైపు మహీంద్రా విశ్వవిద్యాలయం యొక్క ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని స్కూల్ ఆఫ్ డిజైన్ సూచిస్తుంది. డిజైన్ అనేది సౌందర్యానికి సంబంధించినది మాత్రమే కాకుండా వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించే పరిష్కారాలను రూపొందించడం అని మేము నమ్ముతున్నాము. మా కఠినమైన పాఠ్యాంశాలు మరియు అత్యాధునిక సదుపాయాలు ద్వారా భవిష్యత్తు ఉద్యోగాల కోసం మా విద్యార్థులను సిద్ధం చేయాలనుకుంటున్నాము" అని అన్నారు. డిజైన్ మరియు స్కెచింగ్ పట్ల మక్కువ కలిగిన 10+2 విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎంపికైన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఈ స్కూల్ మొదటి బ్యాచ్‌కి ప్రతి సంవత్సరం రూ. 1 లక్షకు సమానంగా 25% ఛాన్సలర్ స్కాలర్‌షిప్‌ను అందించనుంది. మహీంద్రా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ బి. కె. చక్రవర్తి మాట్లాడుతూ , " ప్రయోగాత్మక అనుభవాలు, ఫీల్డ్ విజిట్‌లు మరియు క్రాస్-కల్చరల్ డిజైన్ బూట్ క్యాంపుల ద్వారా, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలు మరియు మనస్తత్వాన్ని మా విద్యార్థులలో పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాము'' అని అన్నారు.

# హైదరాబాద్‌లో ఆగస్టు 3న ఫిల్మ్‌ఫేర్ అవార్డులు



హైదరాబాద్, జులై 18 : అత్యంత ప్రతిష్మాత్మక ఫిలింఫేర్ అవార్డులు ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్స్, ట్రేడ్ ఫెయిర్స్ లో జరగనున్నాయి. ఈ వేడుకలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సినిమాల్లోని అత్యుత్తమ వ్యక్తులను సత్కరించనున్నారు. కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీతో కలిసి 69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024 ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ట్రోఫీని సినీ నటులు మాళవిక మోహనన్, రుక్మిణి వసంత్, ఫిల్మ్‌ఫేర్ చీఫ్ ఎడిటర్ జితేష్ పిళ్లై, శోభా లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సుమిత్ చుంఖారే, కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీకమర్ డీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరల్డ్‌వైడ్ మీడియా డైరెక్టర్, జెడ్ఈఎన్ఎల్ బీసీసీఎల్ టీవీ, డిజిటల్ నెట్‌వర్క్ సీఈవో రోహిత్ గోపకుమార్ మాట్లాడుతూ తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ సినిమాలు సృజనాత్మకతతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా చేయడం ద్వారా మమ్మల్ని తీవ్రంగా ప్రభావితం చేశాయన్నారు. భారతీయ సినిమాకు కొత్త ప్రమాణాలు అద్దారన్నారు. ఈ అసాధారణ ప్రతిభను సత్కరించడానికి అంకితభావంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఫిలింఫేర్ చీఫ్ ఎడిటర్ జితేష్ పిళ్లై మాట్లాడుతూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ దక్షిణాదిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో కథా కథనంతో ప్రేక్షకులను అలరిస్తున్న సినిమాలకు ఇస్తున్నామని తెలిపారు. ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ 69వ ఎడిషన్‌తో మీ ముందుకు వస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శోభా లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సుమిత్ చుంఖారే మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఫిల్మ్‌ఫేర్ అవార్డులతో భాగస్వామ్యం పట్ల సంతోషంగా ఉందన్నారు. అనేక దశాబ్దాలుగా శోభా, ఫిల్మ్‌ఫేర్ రెండు కలిసి సాగుతున్నాయని తెలిపారు. మా భాగస్వామ్యం విలువలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ కమర్ డీ మాట్లాడుతూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో భాగం అయినందుకు థ్రిల్‌గా ఉన్నామన్నారు. ఇది సౌత్ ఇండియాలో సినిమాటిక్ ఎక్సలెన్స్ ఐకానిక్ వేడుక అన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.